హౌసింగ్‌బోర్డు కాలనీలోని రిజర్వాయర్ పరిధిలో 24 గంటల మంచినీటి సరఫరా పనులను పరిశీలిస్తున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

వచ్చే నెల నుంచి నిరంతర నీటి సరఫరా

- హౌసింగ్‌బోర్డు కాలనీ రిజర్వాయర్ పరిధిలో అమలు చేస్తాం • మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, జూన్ 9: కరీంనగర్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన 24 గంటల మంచినీటి సరఫరాకు సంబంధించిన పనులను జూలై చివరి నాటికి పూర్తి చేయించి, హౌసింగ్‌బోర్డు కాలనీ రిజర్వాయర్ పరిధిలో ఇంటింటికీ నిరంతరం నీరందిస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. ఆదివారం స్థానిక రిజర్వాయర్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోనే మొట్టమొదటి సారి ఓ రిజర్వాయర్ పరిధిలో 24 గంటల మంచినీటి సరఫరా చేసేందుకు నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటున్నదన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద రూ. 16 కోట్ల వ్యయంతో ఈ రిజర్వాయర్ పరిధిలో పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ రిజర్వాయర్ పరిధిలో నాలుగు వేల నల్లా కనెక్షన్లు ఉండగా, ఇప్పటికే మూడు వేలకు పైగా మీటర్ల బిగింపు ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. మిగిలిన నల్లా కనెక్షన్లకు కూడా వచ్చే రెండు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. పూర్తిస్థాయిలో నీటి ప్రెషర్ ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. నీటిని పొదుపుగా వాడుకునే వారికి నెలకు రూ.100 కంటే కూడా తక్కువగా వచ్చేలా రేట్లు నిర్ణయించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి దేశంలో పలు ప్రాంతాల్లో అమలవుతున్న 24 గంటల మంచినీటి సరఫరా తీరుపై సమీక్షించాలని అధికారులకు సూచించారు. ఈ పైలెట్ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం నగరవ్యాప్తంగా నిరంతర నీటి సరఫరా ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు. హౌసింగ్‌బోర్డు కాలనీని ఒక మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ రిజర్వాయర్ పరిధిలోని గాయత్రినగర్, మారుతినగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లో 24 గంటల మంచినీరు అందిస్తామని పేర్కొన్నారు. మీటర్ల బిగింపు విషయంలోనూ ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో కార్పొరేటర్ కోల మాలతీ సంపత్, నాయకుడు ఆకుల ప్రకాశ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష

తిమ్మాపూర్: శ్రీ చైతన్య కళాశాలలోని పరీక్ష కేంద్రం వద్ద బారులు తీరిన అభ్యర్థులు

- నిమిషం నిబంధనకు పలువురు బలి
- 14,577 మంది అభ్యర్థుల హాజరు

కలెక్టరేట్, జూన్ 9: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష జిల్లాలో సజావుగా సాగింది. జిల్లా యంత్రాంగం ముందు చూపు, పకడ్బందీ ప్రణాళికతో కేంద్రాల్లో చిన్న తప్పిదానికి కూడా ఆస్కారం లేకుండా నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. నిబంధనల అమలుపై మొదటి నుంచే ప్రచారం చేయడంతో అభ్యర్థులు తూచా తప్పకుండా పాటించారు. నిమిషం ఆలస్యం నిబంధన నేపథ్యంలో అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు రెండు గంటల ముందుగానే చేరుకుని, కేంద్రాల ఎదుట వేచిచూడడం కనిపించింది. ఉదయం 9 గంటల నుంచే అభ్యర్థులను తనిఖీ చేస్తూ, కేంద్రాల్లోకి పంపారు. ముందుగా ప్రకటించినట్లుగా ఉదయం 10 గంటలకే పరీక్ష కేంద్రం గేట్లు మూసివేశారు. ప్రతి అభ్యర్థి బయోమెట్రిక్ వేసిన అనంతరమే పరీక్ష హాల్‌లోకి అనుమతించారు. ఎప్పటి మాదిరిగానే ఈసారి కూడా పలువురు అభ్యర్థులు నిమిషం నిబంధనకు బలయ్యారు. కొన్ని చోట్ల మాత్రం కేంద్రాల గేట్లు మూసివేసిన అనంతరం కూడా చేరుకుని, లోనికి పంపాలంటూ ప్రాధేయపడ్డారు. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గల కేంద్రంలో పరీక్ష రాసేందుకు అర నిమిషం ఆలస్యంగా వచ్చిన అభ్యర్థిని విజ్ఞప్తిని కూడా సిబ్బంది తోసి పుచ్చుతూ నిబంధనలు పక్కాగా అమలు చేశారు. పరీక్ష సామగ్రి కూడా అధికారులు సకాలంలో కేంద్రాలకు చేరవేశారు. పరీక్ష ముగిసిన అనంతరమే తిరిగి హాళ్లలో నుంచి అభ్యర్థులను బయటకు పంపారు. కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 18,663 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వీరంతా పరీక్ష రాసేందుకు వీలుగా 36 కేంద్రాలు ఏర్పాటు చేయగా, 14,577 మంది హాజరయ్యారు. 4,086 మంది గైర్హాజరైనట్లు నోడల్ అధికారిగా వ్యవహరించిన జిల్లా అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ వెల్లడించారు. అంతకు ముందు పోలీస్ కమిషనరేట్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన గ్రూప్ 1 ప్రశ్నపత్రాలు, ఇతర సామగ్రిని ఉదయం ఏడున్నర గంటల నుంచే భారీ భద్రత నడుమ కేంద్రాలకు తరలించారు. పరీక్ష కేంద్రాలను నోడల్ అధికారితో పాటు ఆర్డీవో కె.మహేశ్వర్, ఇతర అధికారులు పరిశీలించారు. పరీక్ష పూర్తికాగానే జవాబుపత్రాలను అత్యంత పకడ్బందీ భద్రతతో తిరిగి స్ట్రాంగ్ రూమ్‌కు తెచ్చి భద్రపరిచారు. అనంతరం నోడల్ అధికారి ప్రపుల్ దేశాయ్ మాట్లాడుతూ, టీజీపీఎస్సీ రూపొందించిన నియమ, నిబంధనలకనుగుణంగా పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. పరీక్ష పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా సహకరించిన పోలీసులు, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

తిమ్మాపూర్, జూన్ 9: మండలంలోని శ్రీ చైతన్య, జ్యోతిష్మతి, వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన సెంటర్లలో గ్రూప్ 1 ప్రిలిమినరీ టెస్ట్ సజావుగా సాగింది. ఉదయం 10.30గంటలకు పరీక్ష ప్రారంభం కాగా మధ్యాహ్నం ఒంటి గంటకు పరీక్ష ముగిసింది. అభ్యర్థులు రెండు గంటల ముందే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. పోలీసులు, సెంటర్ సిబ్బంది అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి పంపించారు. ట్రాఫిక్, ఇతర ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

నిమిషం ఆలస్యంతో..

పరీక్ష పదిన్నర గంటలకు ప్రారంభమైనా సెంటర్‌లోనికి 10గంటల వరకే అభ్యర్థులను అనుమతించారు. వాగేశ్వరిలో 10మంది, శ్రీ చైతన్యలో ఒకరు, జ్యోతిష్మతిలో ఐదుగురు ఆలస్యంగా వచ్చారు. సరిగ్గా పది గంటలకు గేట్లు మూయడంతో అభ్యర్థులు చేసేదేమీ లేక వెనుదిరిగారు.

కరీంనగర్‌లో పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

నేటి నుంచి ప్రజావాణి

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి • కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, జూన్ 9: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం నేటి నుంచి యథావిధిగా కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో కొనసాగుతుందని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఇన్ని రోజులు ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రతి సోమవారం యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

కేంద్ర మంత్రులకు వినోద్ కుమార్ శుభాకాంక్షలు

విద్యానగర్, జూన్ 9: కేంద్ర మంత్రులుగా గంగపురం కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో వారికి శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర మంత్రులుగా తెలంగాణ అభివృద్ధి కోసం పాటు పడతారని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్పొరేటర్ సస్పెన్షన్

కార్పొరేషన్, జూన్ 9: పార్టీ క్రమశిక్షణ రహిత్య చర్యలకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదుల మేరకు 49వ డివిజన్ కార్పొరేటర్ కమల్‌జీత్ కౌర్‌తో పాటు ఆమె భర్త సోహన్‌సింగ్, సుడా మాజీ అడ్వైజరీ కమిటీ సభ్యుడు కామరపు శ్యామ్‌ను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేటర్ కమల్‌జీత్ కౌర్, సోహన్‌సింగ్ కార్యకలాపాలతో పార్టీకి తీవ్రంగా నష్టం వాటిల్లుతున్నదని పేర్కొన్నారు. గతంలో పార్టీ షోకాజ్ నోటీసు ఇచ్చినప్పటికీ వారి తీరు మారలేదని, తాజాగా ప్రెస్‌మీట్ పెట్టి తప్పుడు సమాచారం ఇవ్వడాన్ని పార్టీ చాలా సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిపారు. వారు ఉద్దేశపూర్వంగానే బీఆర్ఎస్‌కు నష్టం వాటిల్లేలా వ్యవహరిస్తున్నందున ఇద్దరినీ పార్టీ నుంచి సస్పెండ్ చేశామని పేర్కొన్నారు. అలాగే కామరపు శ్యామ్ సుడా డైరెక్టర్‌గా కొనసాగినప్పటికీ కూడా పార్టీ నుంచి ఎలాంటి లబ్ధి పొందలేదని ఆరోపించడం, పదే పదే జిల్లా అధ్యక్షుడి ఆడియో రికార్డింగ్‌ను గ్రూపుల్లో పెట్టి పార్టీ ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రవర్తించినందుకు క్రమశిక్షణ చర్యల కింద ఆయనను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

రామోజీ రావు మృతికి నారదాసు సంతాపం

కమాన్‌చౌరస్తా, జూన్ 9 : 'ఈనాడు' గ్రూపు సంస్థల చైర్మన్, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత రామోజీరావు మృతికి మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు సంతాపం వ్యక్తం చేశారు. మీడియా సంస్థల వ్యవస్థాపకుడిగా, పలు రంగాల్లో వ్యాపారవేత్త రామోజీరావు అందించిన సేవలు కొనియాడారు.

నీట్ పేపర్ లీకేజీపై విచారణ జరుపాలి

తెలంగాణచౌక్, జూన్ 9: ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పేపర్ లీకేజీపై విచారణ జరుపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మే 5న నిర్వహించిన నీట్ పరీక్షకు దేశ వ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఒకే పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురు విద్యార్థులకు 724 మార్కులకు 724 మార్కులు రావడంతో పరీక్ష నిర్వహణపై అనుమానాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి వెంటనే విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

ఎంపీ కార్యాలయం వద్ద సంబురాలు

ఎంపీ కార్యాలయం వద్ద సంబురాలు జరుపుకొంటున్న బీజేపీ శ్రేణులు

విద్యానగర్, జూన్ 9 : బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు కేంద్ర మంత్రి పదవి దక్కడంపై స్థానిక ఎంపీ కార్యాలయం వద్ద బీజేపీ శ్రేణులు సంబురాలు అంబరాన్నంటాయి. డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ కార్యకర్తలు సంతోషాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, లోకేశ్, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు రిజర్వేషన్లు కల్పించాలి

తెలంగాణచౌక్, జూన్ 9: యాదవులకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కన్నెబోయిన ఓదెలు యాదవ్, జిల్లా అధ్యక్షుడు నాగారపు సత్యనారాయణ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు అన్ని రాజకీయ పార్టీలు అధిక ప్రాధాన్యతను కల్పించాలని కోరారు. నామినేటెడ్ పదవుల్లో యాదవులకు రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రవీందర్, వెంకటమల్లు యాదవ్, మహిళా విభాగం అధ్యక్షురాలు సందబోయిన గీతాంజలి, నాయకులు రాజ్‌కుమార్, రాజుయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, రవి యాదవ్, రమేశ్ యాదవ్, జంగ కొమురయ్య యాదవ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జూన్ 9: నగరంలో లైన్ షిఫ్టింగ్, ట్రాన్స్ ఫార్మర్ మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 9: 30 నుంచి 11:30 గంటల వరకు వెంకటేశ్వర కాలనీ, రామచంద్రపురం కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

నిమ్మరసం వితరణ

మానకొండూర్, జూన్ 9: ముంజంపల్లి గ్రామానికి చెందిన 1988-89 టెన్త్ బ్యాచ్‌కు చెందిన బాల్యమిత్రులు మండల కేంద్రంలోని పల్లెమీద చౌరస్తా వద్ద నెల క్రితం చలివేంద్రం ఏర్పాటు చేశారు. కరీంనగర్- వరంగల్ రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం ద్వారా నెల రోజులుగా ప్రయాణికులకు చల్లని తాగునీరుతో పాటు మజ్జిగను నిర్వాహకులు అందజేశారు. ఆదివారం చలివేంద్రంలో నిమ్మరసం పంపిణీ చేసి చలివేంద్రాన్ని తీసివేశారు. బాల్యమిత్రులు కైరి తిరుపతిగౌడ్, దాసరి కుమార్, సంద శివశంకర్, గాలిపెల్లి సంతోష్, యాళ్ల నర్సింహారెడ్డి, కాసం సుధాకర్‌రెడ్డి, వేణువంక వీరస్వామి, రాజమౌళి, మత్తోజు చిరంజీవిచారి, కొత్త రాజిరెడ్డి, నాగాంజనేయులు, జంషీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన

మార్వాడి మందిర్‌లో మార్వాడి సంఘ సభ్యులకు వైద్య పరీక్షలు చేస్తున్న మెడికవర్ వైద్యుడు

విద్యానగర్, జూన్ 9: కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్, మార్వాడి యువ మంచ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సిక్కువాడీ చౌరస్తా ఎదురుగా ఉన్న మార్వాడి మందిర్‌లో మార్వాడి సంఘ సభ్యులకు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 200 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో, గైనకాలజీ, న్యూరో, ఆర్థో మొదలైన సూపర్ స్పెషాలిటీ వైద్య పరీక్షలు నిర్వహించారు. హాస్పిటల్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ చీటీ కార్తీక్, గైనకాలజిస్టు డాక్టర్ ప్రతిష్టా రావు, కార్డియాలజిస్ట్ డాక్టర్ రామనాథం, ఆర్థోపెడిషియన్ డాక్టర్ వేణుగోపాల్, న్యూరో సర్జన్ డాక్టర్ బోగా వెంకటేశ్ వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు ద్వారా మెడికవర్ యాజమాన్యం ప్రజల వద్దకు సూపర్ స్పెషాలిటీ వైద్యులను తీసుకువచ్చి వైద్య సేవలు అందిస్తున్నదన్నారు. అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అందుబాటులోకి తేవడమే కాకుండా సెలవులతో సంబంధం లేకుండా రాత్రిపగలనే తేడా లేకుండా సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మార్వాడి యువ మంచ్ అధ్యక్షుడు రూపక్ ముందడ, ఉపాధ్యక్షుడు విజయ్ లహోటి, సెక్రటరీ నిఖిల్ దోడియా, బాధ్యులు ఆశీస్ లహోటి, వినయ్ లాహోటి, మన్మోహన్ ముందడ, నిర్మల్ నారాయణ ముందడ, హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, దాసరి చంద్ర శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

మునవర్ జమాను సన్మానించిన ఎంఐఎం నేతలు

కలెక్టరేట్, జూన్ 9: అంతర్జాతీయ ఉపన్యాసకుడు మునవర్ జమాను ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్‌తో పాటు పలువురు నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. నగరంలోని ఓ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను స్థానిక మైత్రీ కన్వెన్షన్ హాల్‌లో పలువురు ముస్లిం మత పెద్దలు, నాయకులు కలిశారు. అనంతరం ఎంఐఎం అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్‌పై ఉపన్యసిస్తూ, వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం అమోఘమన్నారు. జీవితంలో బతకడం నేర్చుకునే విధానంపై మోటివేటర్ మునవర్ జమా ఇచ్చిన సందేశం ప్రతి ఒక్కరి మదిలో నిలుస్తుందన్నారు. అనంతరం మక్కా నుంచి తెచ్చిన పవిత్ర జలం జంజంను ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఐఎం కార్పొరేటర్లు అఖిల్ ఫిరోజ్, మహ్మద్ షర్ఫుద్దీన్, అతిన, అలీబాబా తదితరులు పాల్గొన్నారు.

డీసీఎం వ్యాన్ ఢీ

ఒకరికి తీవ్రగాయాలు

వీణవంక, జూన్ 9: మండలంలోని చల్లూరు పెట్రోల్ బంక్ వద్ద డీసీఎం వ్యాన్ మోటార్ సైకిల్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన ఒజ్జె నారాయణ ఆదివారం మోటార్ సైకిల్‌పై పని మీద చల్లూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా, అదే సమయంలో పోతిరెడ్డిపల్లి నుంచి కరీంనగర్‌కు వెళ్తున్న డీసీఎం వ్యాన్ చల్లూరు పెట్రోల్ బంక్ వద్ద ఢీకొన్నది. మోటార్ సైకిల్ పైనుంచి పడడంతో ఒజ్జె నారాయణ కాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే నారాయణను కరీంనగర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

చొప్పదండి, జూన్ 9: చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యుడు బైరగోని ఆనంద్ ఇటీవల మృతిచెందగా, ఆయన కుటుంబ సభ్యులకు అధ్యక్షుడు వెల్మ మల్లారెడ్డి సొసైటీ తరపున రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు ముద్దం మహేశ్‌గౌడ్, డైరెక్టర్ నాంపల్లి మల్లయ్య, నాయకులు మునిగాల చందు, ఏలేటి తిరుపతిరెడ్డి, కిట్టు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ వికాసానికి దోహదపడేలా విద్యాబోధన

మాట్లాడుతున్న సొగాని కొమురయ్య

- భవిష్యత్తుకు ఉపయోగపడేలా కరిక్యులం వివేకానంద
- విద్యాసంస్థల చైర్మన్ సొగాని కొమురయ్య

కమాన్‌చౌరస్తా, జూన్ 9 : విద్యార్థులు సంపూర్ణ వికాసంతో ఎదగాలనే ఉద్దేశంతో జేఎస్-3 సహకారంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కరిక్యులంతో విద్యాబోధన చేస్తున్నట్లు వివేకానంద విద్యానికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సొగాని కొమురయ్య పేర్కొన్నారు. భగత్‌నగర్‌లోని పాఠశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన వివిధ కరికులు సమావేశంలో ఆయన జేఎస్-3 సభ్యుడు శ్రీనివాస్ రెడ్డితో కలిసి మాట్లాడారు. 35 సంవత్సరాల నిర్వహిస్తున్న వివేకానంద విద్యాసంస్థల్లో భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని జేఎస్-3 సహకారంతో రెండు సంవత్సరాలుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న కరిక్యులంతో విద్యాబోధన చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో విద్యార్థులకు బాడీ, బ్రెయిన్, మైండ్, సోల్ అభివృద్ధి చెందేలా ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. అలాగే, విద్యార్థులకు వీకెండ్ విత్ ఎక్స్‌పర్ట్, గ్రామదర్శిని, నిర్వహణ, ప్రకృతి స్పర్శ, పిడికెడు బియ్యం, వృద్ధదేవోభవ, హీరో ఆఫ్ ది మంత్ ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలో చేర్పించే క్రమంలో ఆ పాఠశాలలో అందిస్తున్న చదువుతో పాటు, ఎక్స్‌ట్రా యాక్టివిటీస్‌ను కూడా గమనించాలని, అవి విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడేలా ఉండాలని సూచించారు. అంతకు ముందు 'ఈనాడు' గూపు సంస్థల చైర్మన్ రామోజీరావు మృతికి నివాళులర్పించారు.

బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

ఓబులాపూర్‌లో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

చిగురుమామిడి, జూన్ 9: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విద్యపై అవగాహన కల్పించారు. సర్కారు బడుల్లో అన్ని వసతులతో ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, పిల్లలను చేర్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఒగ్గు, బీర్ల కళాకారుల సంఘం నూతన కార్యవర్గం

నూతన అధ్యక్షుడు సాయిల శివయ్య, పాలక సభ్యులు

కరీంనగర్ రూరల్, జూన్ 9: ఒగ్గు, బీర్ల కళాకారుల సంక్షేమ సంఘం కరీంనగర్ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయిల శివయ్య, ఉపాధ్యక్షుడిగా ఈరు పోచమల్లు, ప్రధాన కార్యదర్శిగా సాయిల్ల ఓదెలు, కోశాధికారిగా సాయిల రమేశ్, సహాయ కార్యదర్శిగా ఈరు రాజు, ప్రచార కార్యదర్శిగా సాయిల రాజమల్లు, కార్యవర్గ సభ్యులుగా సాయిల్ల శ్రీనివాస్, కచ్చు ఆశాలు, సాయిల్ల రాజయ్య, ఈరు రాజు, ఈ మల్లయ్య ఎన్నికైనట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సభ్యులు అశోక్, కొమురన్న, కనకయ్య, ఈరు ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న క్రికెట్ క్లబ్ ప్రెసిడెంట్, మాజీ మార్కెట్ చైర్మన్

రామడుగు (చొప్పదండి), జూన్ 9: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని రామడుగు క్రికెట్ క్లబ్ ప్రెసిడెంట్ ఎడవెల్లి ఆనందరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. రామడుగు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రామడుగు మండల ప్రీమియర్ లీగ్ సీజన్ 2 ప్రారంభోత్సవ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. క్రీడాకారులు స్నేహపూర్వక వాతావరణంలో పోటీల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటాలని సూచించారు. సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు సీజన్ 1, 2కి కూడా స్పాన్సర్‌షిప్ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ముంజాల ప్రవీణ్ గౌడ్, ఆరేపల్లి ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి చందు, సహ కార్యదర్శి అరవింద్ రెడ్డి, ట్రెజరీ తిరుపతి, పెసరి అజయ్, హైమద్, గుండి వినయ్ పాల్గొన్నారు.

చెట్ల నరికివేత

జూబ్లీనగర్-చామనపల్లి మార్గంలో నరికివేసిన వృక్షాలు

కరీంనగర్ రూరల్, జూన్ 9: మండలంలోని జూబ్లీనగర్- చామనపల్లి గ్రామాల మధ్య ఉన్న చెట్లను కొద్ది రోజులుగా కొందరు ఇష్టానుసారంగా నరికి వేస్తుండడంతో పచ్చదనం కనుమరుగువుతున్నది. ఇటీవల పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఇదే దారిలో వచ్చిన కలెక్టర్, చామనపల్లి మానస సరోవరం వద్ద మొక్కలు నాటి, పచ్చదనాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యతకను స్థానికులకు వివరించారు. కనీసం ఐదు రోజులు కూడా గడవకముందే బాటసారులకు చల్లని నీడను పంచుతున్న వృక్షాలు గొడ్డలి వేటుకు గురి కావడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి, ఈ దారిలో ఆహ్లాదాన్ని పంచుతున్న చెట్లను కాపాడాలని కోరుతున్నారు.

కరీంనగర్ రూరల్: ఆత్మీయ సమ్మేళనంలో మొగ్దుంపూర్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

రామడుగు మండలం గోపాల్ రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

చొప్పదండి జిల్లాపరిషత్ బాలుర పాఠశాలలో..

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

కరీంనగర్ రూరల్/ శంకరపట్నం/ రామడుగు, (చొప్పదండి), జూన్ 9: వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకొన్నారు. గురువులను ఆహ్వానించి, ఘనంగా సన్మానించి గురుభక్తిని చాటుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకోవడంతోపాటు ఆ